

సిద్దిపేట జిలా దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డిలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజానీకాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

## కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సురక్షితం

- కాంగ్రెస్ నాయకులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన లేదు
- టీవీ చానెల్‌తో హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకనే, కేసీఆర్ సీఎం అయ్యాకనే రైతు విలువ, గౌరవం పెరిగిందని, భూమి విలువ పెరిగిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. తల్లి చేతిలో బిడ్డ ఏ విధంగా సురక్షితమో, కేసీఆర్ చేతిలో తెలంగాణ ఉంటేనే సురక్షితంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ వస్తే ముఠాలు ఉంటాయన్నారు. బుధవారం ఒక న్యూస్ చానల్‌తో హరీశ్ మాట్లాడుతూ తాను నిబద్ధత గల బీఆర్ఎస్ నాయకుడినని, పదవులు కోరుకోనని, క్యారెక్టర్‌ను కోరుకుంటానని స్పష్టం చేశారు. పార్టీ ఏది ఆదేశిస్తే అది చేస్తానని చెప్పారు. కాంగ్రెస్‌కు రాష్ట్ర పథకాలపై కనీస అవగాహన లేదని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటికే మోకాలు ఆపరేషన్ చేస్తున్నామని, కానీ కాంగ్రెస్ మోకాలి చికిత్సను ఆరోగ్యశ్రీలో చేరుస్తామని చెప్పడం వారికి గ్రౌండ్ రియాల్టీ తెలియనడానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆఫీసు లీడర్లు తప్ప ఫీల్డ్ లీడ ర్లు కాదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఎక్కడా కూడా భూస్వాములు లేరని, మూడు ఎకరాల స్థలం ఉన్న వారు 93 శాతం ఉన్నారని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇచ్చే స్థాయికి వ్యవస్థలను ప్రభు త్వం సిద్ధం చేసిందని తెలిపారు. మూడోసారి అధికారంలోకి రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామని, ప్రశ్నపత్రం లీక్ చేసిన వారు జైల్లో ఉన్నారనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. బీజేపీ బీఆర్ఎస్ ఒకటి అయితే గవర్నర్ తాము పంపిన బి ల్లును ఎందుకు తిప్పి పంపుతారని ప్రశ్నించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా వేతనాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా.. ఎన్నికల సంఘం అనుమతించడంలేదని చెప్పారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మీటర్లకు ఒప్పుకొన్నట్టే

## బీజేపీ, కాంగ్రెస్ బండారం బట్టబయలు

- మోటర్లకు మీటర్లపై 2 పార్టీలది ఒకేమాట
- బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్రాల్లో మోటర్లకు మీటర్లు
- మీటర్లు పెట్టేందుకు కర్ణాటక అసెంబ్లీ తీర్మానం
- దేశంలో రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ ఒక్కరే
- నిజాలు బయటపెట్టిన కేంద్రమంత్రి నిర్మల
- వ్యవసాయంపై స్వామినాథన్ సిఫారసులు
- బుట్టదాఖలు చేసిన ఆ రెండు ఢిల్లీ పార్టీలు
- సిద్దిపేటలో మీడియాతో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేంద్రంలోని బీజేపీ శాసించింది.. రాష్ట్రాల్లోని కాంగ్రెస్ పార్టీ అమలుచేసింది. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టే విషయంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయన్న సంగతి కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ మాటలతో బట్టబయలైందని రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. బాయిలకాడ మోటర్లకు మీటర్లు పెడితేనే రుణాలు తెచ్చుకొనేందుకు అనుమతిస్తామన్న కేంద్రం షరతులను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కూడా అమలు చేశాయని ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర మంత్రి వెల్లడించారని తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివానుభవ మండపంలో బుధవారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కేంద్రం షరతులకు అంగీకరించిన రాష్ట్రాల్లో మోటర్లకు మీటర్లు పెట్టి.. రైతుల ఇంటికి బిల్లులు పంపిస్తున్నారని చెప్పారు. కేంద్రం షరతులకు లొంగని ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. 'అందువల్లనే తెలంగాణకు పైసలు ఆపినం' అని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారని పేర్కొన్నారు. కేసీఆర్‌తోనే రైతులు సురక్షితంగా ఉన్నారని అన్నారు. 'చేతులు జోడించి రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా.. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బాయిలకాడ మీటర్లు పెట్టేందుకు ఆంగీకరించినట్టే' అని చెప్పారు.

### మభ్య పెట్టిన బీజేపీ నేతలు

మోటర్లకు మీటర్లు పెట్టే విషయంలో తెలంగాణ బీజేపీ నేతలు ఇంతకాలం ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారని హరీశ్‌రావు విమర్శించారు. మీటర్లు పెట్టుమన్నట్టు రుజువుచేస్తే ఒక నాయకుడు ముక్కు నేలకు రాస్తా అంటే.. మరొకరు ఏకంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారని చెప్పారు. ఇప్పుడు నిర్మలాసీతారామన్ కుండబద్ధలు కొట్టారని, బీజేపీ నేతలు ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని నిలదీశారు. ఈ దేశంలో రైతు పక్షపాతి ఒకే ఒక్కడు సీఎం కేసీఆర్ అన్న మరో సంగతి కూడా నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలో స్పష్టమైందని అన్నారు.

### 12 రాష్ట్రాల్లో మోటర్లకు మీటర్లు

దేశంలో 12 రాష్ట్రాలు మోటర్లకు మీటర్లు పెట్టారని, తమ (కేంద్రం) వద్ద డబ్బులు తీసుకున్నారని, మరికొన్ని రాష్ట్రాలు దరఖాస్తు చేశాయని, వాటికి రేపో మాపో నిధులు విడుదల చేస్తామని కూడా నిర్మల చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. దరఖాస్తు చేయనిది, రైతుల పక్షాన నిలిచింది కేవలం సీఎం కేసీఆర్ మాత్రమేనని దీనిని బట్టి రుజువవుతున్నదని చెప్పారు. రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతుల ప్రయోజనాలు ముఖ్యమా? కేంద్రం ఇచ్చే 25 వేల కోట్లు ముఖ్యమా? అన్నప్పుడు కేసీఆర్ రైతుల పక్షానే నిలిచారని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు మోటర్లకు మీటర్లు పెడతామని చెప్పి పైసలు తెచ్చుకున్నారని చెప్పారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ సర్కార్ మీటర్లు పెడతామని అసెంబ్లీలో తీర్మానం చేశారని తెలిపారు. బీజేపీ పాలిత యూపీ, అస్సాం, మణిపూర్‌లో, ఇండియా కూటమి అధికారంలో ఉన్న తమిళనాడు, బెంగాల్, కేరళలో కూడా మీటర్లు పెట్టారని చెప్పారు. తప్పిపోయి రేపు తెలంగాణలో కాంగ్రెస్ లేదా బీజేపీ గానీ గెలిస్తే.. మోటర్లకు మీటర్లు పెట్టి, ఉచిత కరెంట్ లేకుండా చేస్తారని హెచ్చరించారు.

### కాంగ్రెస్, బీజేపీ రైతుల పాలిట శత్రువులు

దేశంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి స్వామినాథన్ కమిటీ ఇచ్చిన నివేదికను కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బుట్టదాఖలు చేశాయని హరీశ్‌రావు ఆరోపించారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో కాంగ్రెస్ ఆ రిపోర్టును తుంగలో తొక్కిందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని, దేశమంతా కాలికి బలపం కట్టుకొని తిరుగుతానని ప్రధాని మోదీ చెప్పారని గుర్తుచేశారు. కానీ తొమ్మిదేండ్లు గడిచిపోయినా ఆ సిఫారసులను అమలు చేయలేదని మండిపడ్డారు. స్వామినాథన్ సిఫారసుల అమలుకు కాంగ్రెస్ ఏనాడైనా పోరాటం చేసిందా? అని ప్రశ్నించారు.

### బీజేపీది గురివింద నీతి

అప్పుల గురించి కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చెప్పడం నిజంగా సిగ్గుచేటని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేనాటికి దేశం మీద ఉన్న అప్పు దాదాపు రూ.55 లక్షల కోట్లు అని, ఇప్పుడు అది రూ.155 లక్షల కోట్లు దాటిందని చెప్పారు. దాదాపు ప్రతి నెల లక్ష కోట్లు అప్పు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని మండిపడ్డారు. బీజేపీ నేతలు తమకు నీతులు చెప్పడం గురివింద సామెతను గుర్తు చేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారమే.. జీఎస్డీపీలో తెలంగాణ అప్పుల వాటా 28% అని తెలిపారు. దేశ జీడీపీలో 57 శాతం అప్పులతో దేశాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీజేపీది అని దుయ్యబట్టారు. రూపాయి విలువ తగ్గించింది, నిరుద్యోగ సమస్యలకు కారణం, బీడీ కట్టల మీద పన్ను వేసింది, సిలిండర్ ధరను 400 నుండి 1200కు పెంచింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు.

### తెలంగాణపై బీజేపీ కక్ష

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో కొంత ఆలస్యమైందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రానికి నిధులు ఆపిన విషయాన్ని స్వయంగా కేంద్ర మంత్రి నిర్మల నిన్ననే అంగీకరించారని తెలిపారు. దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఆపి బీజేపీ మనమీద కక్ష కట్టిందని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ ఉద్యోగుల సన్నిహిత ప్రభుత్వమని అంటూ.. రెండు పీఆర్సీలు ఇచ్చింది, తొమ్మిదేండ్లలో 133 శాతం వేతనాలు పెంచింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అంగన్‌వాడీ, ఆశ, వీఏవోలను గుర్రాలతో తొక్కించిందని, ఆ పార్టీని నమ్మితే మోసపోతామని అన్నారు. వీఆర్ఏలను, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసింది కేసీఆర్ అని చెప్పారు. సీపీఎస్ నుండి ఓపీఎస్ విధానానికి రాష్ట్రం కట్టుబడి ఉందని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణ శర్మ, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, చిన్నకోడూరు ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో రోడ్‌షో సందర్భంగా అభిమానంతో మంత్రి హరీశ్‌రావును అక్కున చేర్చుకొని ఆశీర్వదిస్తున్న ఓ వృద్ధురాలు

> 'బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతోపాటు రామక్క పాటను సైతం కాంగ్రెస్ కాపీ కొట్టింది. రామక్క పాట ఇప్పుడు తెలంగాణలో దుమ్మురేపుతున్నది. సీఎం కేసీఆర్ మీద ప్రేమతో కల్వకుర్తికి చెందిన ఒక చెల్లి రాసిన పాటతో కాంగ్రెస్, బీజేపీ గుండెలు ఝల్లుమంటున్నాయి' -మంత్రి హరీశ్‌రావు

## నూకలు తినమన్న బీజేపీకి నూకల్లేకుండా చేయాలి

**ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాలి.. దుబ్బాక రోడ్‌షోలో హరీశ్**

సిద్దిపేట, నవంబర్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ రైతులను నూకలు బుక్కమని చెప్పిన బీజేపీకి రాష్ట్రంలో నూకలు లేకుండా చేయాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు మోటరుకు మీటర్ అంటుంటే కాంగ్రెస్ నేతలు 3 గంటల కరెంటు అంటున్నారని, ఆ రెండు పార్టీలను నమ్మితే మోసపోతామని హెచ్చరించారు. బుధవారం ఆయన దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మిరుదొడ్డి, భూంపల్లి-అక్బర్‌పేట, నార్సింగ్ మండల కేంద్రాల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రామక్క పాటలో ఎక్కడ కొట్టుకపోతామోనన్న భయం కాంగ్రెస్, బీజేపీకి పుట్టుకున్నదని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, ఇవాళ మళ్లీ కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. బీజేపీ గెలిస్తే బోరు కాడ, బాయి కాడ మోటర్ వస్తదని చెప్పానని, ఇప్పుడు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కూడా బాయిల కాడ మీటర్లు తెలంగాణ ప్రభుత్వం పెట్టలేదని, అందుకే నిధులివ్వలేదని చెప్పారని గుర్తుచేశారు. ఆమె మాటలు విన్నాక రఘునందన్‌రావు తల కాయ ఎక్కడ పెట్టుకుంటాడని ప్రశ్నించారు. ప్రభుత్వం భూములను గుంజుకుంటుందంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు ఇచ్చేలా పట్టాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు.

### ప్రభాకరన్నను చంపాలని చూశారు

బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకరన్నను కొందరు చంపాలని చూశారని మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. మీ అందరి ఆశీస్సులు, దేవుడి దయతో బతికి బయటపడ్డారని చెప్పారు. దీన్నికూడా కొందరు చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. దుబ్బాక ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్, బీజేపీ కుట్రలను లౌకికవాదులు తిప్పికొట్టాలి

- రాష్ట్రంలో ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందాలు
- జమా తుల్ -ఉలేమా సమావేశంలో హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ముస్లిం సమాజం బీఆర్ఎస్‌తో లేదనే విష ప్రచారానికి కాంగ్రెస్ తెరతీసిందని, ఇటువంటి కుట్రలను లౌకికవాదులు తిప్పికొట్టాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నుంచి ముస్లిం సమాజాన్ని దూరం చేయడానికే బీజేపీతో సంబంధాలు ఉన్నాయని అసత్యప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో జమాతుల్-ఉలేమా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. సర్వమత సామరస్యం, సర్వజనహితమే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తున్నదని, తొమ్మిదిన్నరేండ్ల పాలనే అందుకు నిదర్శమని చెప్పారు. తెలంగాణలో మాదిరిగా మరే రాష్ట్రంలోనూ లౌకికవిలువలతో కూడిన పాలన సాగడం లేదని తెలిపారు. ముస్లిం సమాజం బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఆరెస్సెస్ మూలాలు ఉన్నాయని ఆరోపించారు. నిర్మల్, గోషామహల్, దుబ్బాక, ముథోల్ సహా అనేక చోట్ల బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం బలహీనమైన అభ్యర్థులను కాంగ్రెస్ పోటీలో దించిందని చెప్పారు. గత ఉప ఎన్నికల్లోనూ బీజేపీ, కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నాయని మండిపడ్డారు. తెలంగాణలో మాదిరిగా మరే రాష్ట్రంలోనూ లౌకికవిలువలతో కూడిన పాలన సాగడం లేదని ఆయన తెలిపారు.

### బీఆర్ఎస్‌కు జమా తుల్ -ఉలేమా మద్దతు

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తామని జమా తుల్-ఉలేమా తెలంగాణ విభాగం ప్రకటించింది. ముస్లిం సమాజ ఉద్ధరణకు కేసీఆర్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని కొనియాడింది. సర్వసమత సహజీవనానికి కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న కృషి భవిష్యత్‌లోనూ కొనసాగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గయాసుద్దీన్, జుబేర్ ఆకాంక్షించారు.

# మా గోస.. మీకొద్దు!

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మద్దతిచ్చి నిండా మోసపోయాం
- మాలాగా మోసపోకండి.. మన రైతులకు కర్ణాటక రైతుల సూచన
- ఇందిరాపార్కు వద్ద కర్ణాటక రైతు సంఘం ఆందోళన

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో గడిగడికీ కరెంటు సమస్య వస్తున్నదని ఆ రాష్ట్ర రైతులు చెప్తున్నారు. తమ సమస్యలు తీర్చుతారని కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే నిండా మోసపోయామని అంటున్నారు. నెల కింది వరకు 3 గంటల కరెంటే ఇచ్చి, తెలంగాణలో ఎన్నికలు ఉన్నాయని అక్కడ 5 గంటలు చేసిందని స్పష్టం చేశారు. రైతు వ్యతిరేక పార్టీలకు ఓటు వేయొద్దు.. రైతు పక్షాన ఉండే పార్టీలకే ఓటు వేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద కర్ణాటక రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర రైతులు సంఘీభావ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ కాంగ్రెస్, బీజేపీపై నిప్పులు చెరిగారు. ఇన్నేళ్లు ఆ రెండు పార్టీలతో రైతు సమాజం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు సంపన్నులు, కార్పొరేట్ శక్తులు పెద్దమొత్తంలో భూములు కొనుగోలు చేసే అవకాశం కల్పించటంతో వేల మంది రైతులు వ్యవసాయానికి దూరమైతున్నారని తెలిపారు. పంప్‌సెట్ల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు, ఇతర పనిముట్లను కూడా రైతులే కొనుక్కోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నదని నిట్టూర్చారు. కర్ణాటకలో కొబ్బరి, పాడి, చెరుకు రైతులకు కనీస మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సాగును భారంగా మార్చేలా తమ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రైతులను దోచుకొనే విధానాలు అవలంబిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కర్ణాటక రైతుల ధర్నాతో కాంగ్రెస్‌లో గుబులు

హైదరాబాద్ వేదికగా కర్ణాటక రైతులు చేపట్టిన ధర్నా కాంగ్రెస్ నేతల్లో గుబులు పుట్టించింది. దీనిని అడ్డుకునేందుకు గేటర్ కాంగ్రెస్ నేతలు ప్రయత్నించడమే ఇందుకు నిదర్శనం. ఇందిరా పార్కుకు చేరుకున్న రైతు సంఘాల నేతలను 'మీకు ఇక్కడేం పని? ఇక్కడ ధర్నా చేయాల్సిన అవసరం ఏమిటి?' అని ప్రశ్నిస్తూ సమావేశాన్ని అడ్డుకోవాలని చూశారు. అయితే కర్ణాటక రైతుల సమాధానంతో కాంగ్రెస్ నేతలకు తల తిరిగింది. 'రైతు వ్యతిరేక విధానాలను అవలంబించే కాంగ్రెస్‌పై ఏ రాష్ట్రంలోనైనా సమావేశాలు పెడతాం. ఢిల్లీలోనూ సభలు నిర్వహించాం. ఎన్నికలు జరిగే అన్ని రాష్ట్రాల్లో పర్యటన చేస్తాం' అని అనటంతో కాంగ్రెస్ నేతలు తోక ముడిచారు. కర్ణాటక రైతులతో కాంగ్రెస్ నేతలు వాగ్వాదానికి దిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



హైదరాబాద్‌లోని ఇందిరా చౌక్ వద్ద అభివాదం చేస్తున్న కర్ణాటక రైతు నాయకులు

### అండగా నిలిచే పార్టీలకే రైతుల ఓట్లు



దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. బీజేపీ, కాంగ్రెస్ రైతుల కోసం ఏ ఒక్క ప్రయోజనకరమైన విధానాలను రూపొందించలేదు. అధికారం కోసం కొన్ని పార్టీలు చేస్తున్న మోసపూరిత ప్రకటనలను గ్రహించి, సాగునీరు, నాణ్యమైన కరెంట్, మద్దతు ధర, పంట నష్టపరిహారం ఇస్తూ భరోసానిచ్చే పార్టీలకే రైతులు అండగా నిలవాలి.

**- కమల్ పటేల్, కర్ణాటక రైతు**

### కాంగ్రెస్‌తో రైతుల బతుకులు నిర్వీర్యం



కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు బతుకులు నిర్వీర్యమవుతున్నాయి. రాష్ట్రంలో మార్కెట్ కమిటీలను రద్దు చేసింది. రైతులు పండించిన పంటను కార్పొరేట్ సంస్థల చేతిలోకి వెళ్లేలా వ్యవహరిస్తున్నది. ఇదే జరిగితే రానున్న రోజుల్లో రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ, ఆహార ఉత్పత్తులను శాసించే పరిస్థితి వస్తుంది.

**- ఉమ, రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్**

### మూడు గంటల కరెంటే



కర్ణాటకలో రైతులకు అవసరమైన కరెంట్ సరఫరా చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది. ప్రస్తుతం మూడు గంటల కరెంట్ కూడా ఇవ్వటం లేదు. వరి, కంది, మిరపకు కనీస మద్దతు ధర రావటం లేదు. దీంతో చేతికి వచ్చిన పంటను నష్టానికే అమ్ముకోవాల్సి వస్తున్నది.

**- దుర్గాప్రసాద్, రాయచూర్**

# 110 స్థానాల్లో బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు

- ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం
- అభివృద్ధి పనులే బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపిస్తాయి
- కాంగ్రెస్ హయాంలో ఎప్పుడూ మత ఘర్షణలే
- 'మీట్ ది ప్రెస్'లో ఎంఐఎం అధినేత, ఎంపీ అసద్



హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ 9 స్థానాల్లో పోటీ చేస్తున్నదని, మిగిలిన 110 స్థానాల్లో బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ వరుసగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, రాష్ట్రంలో గత పదేండ్ల నుంచి కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపిస్తాయని చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఎన్నోసార్లు మతఘర్షణలతో అట్టుడికిన హైదరాబాద్ గత పదేండ్ల నుంచి ఎంతో ప్రశాంతంగా ఉన్నదని, సీఎం కేసీఆర్ పాలనలో మతకలహాలు, కర్ఫ్యూలు మచ్చుకైనా లేవని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ మతఘర్షణలు ఖాయమని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక హైదరాబాద్ పాతబస్తీలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. ఇప్పటికే పలు ఫ్లైఓవర్లు, ఆర్వోబీల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు చాలా మేరకు తగ్గాయని, మిగిలిన ఫ్లైఓవర్లు, ఆర్వోబీల నిర్మాణం కూడా పూర్తయితే ట్రాఫిక్ కష్టాల నుంచి సంపూర్ణ విముక్తి లభిస్తుందని అసద్ వివరించారు.

# అశ్వత్థామరెడ్డి అస్త్రసన్యాసం

- బీజేపీకి రాజీనామా చేసిన నేత
- వనపర్తి అభ్యర్థిగా ప్రకటించి బీఫాం ఇవ్వక పోవడంతో మనస్తాపం
- కిషన్ రెడ్డికి రాజీనామా లేఖ

వనపర్తి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): అసలు క్యాడరే లేదు.. పార్టీలో ఉన్నోళ్లూ పట్టించుకోలేదు.. ఇక ఎందుకు పార్టీలో ఉండటం అని అస్త్రసన్యాసం చేశాడో బీజేపీ నేత. పార్టీకి గుడ్‌బై చెప్తున్నానని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి రాజీనామా లేఖ రాశాడు. ఆర్టీసీ యూనియన్‌లో కార్మిక నేతగా పనిచేసిన అశ్వత్థామరెడ్డి కొంత కాలం కిందట బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్న ఆయనకు పార్టీ అధిష్ఠానం వనపర్తి అభ్యర్థిగా ప్రకటించింది. పార్టీ నుంచి ప్రకటన రాగానే వనపర్తికి చేరుకున్న ఆయన.. స్థానిక బీజేపీ నేతలను కలిసి గెలుపునకు సహకరించాలని కోరారు. వారం పాటు అక్కడే ఉండి ముఖ్య నాయకులతో మాట్లాడి సమన్వయం చేసుకొనేందుకు ప్రయత్నించారు. క్షేత్రస్థాయిలో బీజేపీపట్ల సానుకూలత లేకపోవటంతో పాటు స్థానిక నాయకులెవరూ సహకరించలేదు. బీజేపీ క్యాడర్ మొత్తం ఎడముఖం.. పెడముఖంగా ఉండటం, ఎవరూ పట్టించుకోకపోవటంతో నిరాశకు లోనయ్యారు. కొన్నిరోజుల పాటు వేచిచూసినా ఫలితం లేకపోవటంతో, ఇక తనతో కాదనుకొని చేతులెత్తేశారు. అదే సమయంలో బీజేపీ అధిష్ఠానం ఆయనకు బీఫాం కూడా ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన అశ్వత్థామ రెడ్డి.. బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి రాజీనామా లేఖ పంపారు. బీజేపీ పార్టీని నమ్ముకొని వచ్చినందుకు జరిగిన పరిణామాలతో పార్టీకి రాజీనామా చేశారని వనపర్తి పట్టణంలో ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు.